


అభివృద్ధి మొత్తం మీ వైపే..!

వృద్ధి రేటులో జిల్లా నంబర్ వన్

- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగండి
- సత్యసాయి శతజయంతిని ఘనంగా నిర్వహిద్దాం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

పుట్టపర్తి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంతా శ్రీసత్యసాయి జిల్లా వైపే చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గ్రోత్ రేట్‌లో నంబర్ వన్ స్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సూచించారు. అమరావతిలో కలెక్టర్ల సదస్సు రెండో రోజు బుధవారం జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉన్నందున జిల్లా అభివృద్ధికి చాలా అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జోన్-5 జిల్లాల్లో అభివృద్ధి అంతా శ్రీసత్యసాయి జిల్లా వైపు వచ్చే అవకాశాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కియ రాకతో జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోయానని అన్నారు. రాష్ట్ర వృద్ధి రేటు 12.202 శాతం కాగా, శ్రీసత్యసాయి జిల్లా వృద్ధిరేటు 13.57 శాతం నమోదైందని, జోన్-5 జిల్లాల్లో ప్రథమ స్థానంలో ఉందని అభినందించారు. సేవలలో 24 స్థానంలో నిలిచిందని అన్నారు. సత్యసాయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని, ఒకసారి మాట్లాడి నిర్ణయం తీసుకుందామని అన్నారు. హంద్రీనీవా గేమ్ చేంజర్ అని, సత్యసాయి విమానాశ్రమం, రహదారుల అభివృద్ధి, రవాణా అనుసంధానంతో జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు.

కొత్తగా ఆక్వా ల్యాబ్..

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గొళ్లపల్లి రిజర్వాయర్లలో కొత్తగా చేపల విత్తన కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. పాలు, గుడ్ల ఉత్పత్తిని పెంచడానికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. జిల్లాలో ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేస్తామని, దీనివల్ల మూడు వేల మంది వత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. మైనింగ్, క్వారీల ద్వారా అదనపు ఆదాయం సమకూరిందని తెలిపారు. ప్రధానమైన 15 రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు వచ్చేలా పనిచేస్తున్నామని అన్నారు. నూతన రైల్వే లైన్ల నిర్మాణానికి వంద శాతం భూసేకరణ చేసి రైల్వేశాఖకు అప్పగించామని తెలిపారు.

తలసరి ఆదాయాన్ని పెంచుతాం: కలెక్టర్

జిల్లాలో తలసరి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. కలెక్టర్ల సదస్సులో ఆయన 2025-26 జిల్లాలో కార్యచరణ ప్రణాళిక, ప్రభుత్వ మద్దతు అవసరమయ్యే నిర్దిష్ట సమస్యలు, వచ్చే ఏడాదికి 15శాతం జీఎస్‌డీపీ సాధించేలా కార్యాచరణ, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరు, తొమ్మిది నెలల్లో సాధించిన లక్ష్యాలు, చేట్టాల్సిన అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని, ఐదు వేల హెక్టార్లలో ఈ విధానం అమలవుతోందని తెలిపారు. పది వేల హెక్టార్లలో తృణధాన్యాలను సాగుచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యాన పంటలలో 18.65 శాతం వృద్ధిరేటు సాధించామని అన్నారు. హిందూపురాన్ని పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. సీజనల్ వ్యాధులను నిరోధించడానికి ఆధునిక సాంకేతికను ఉపయోగిస్తున్నామని తెలిపారు.

సాగుకు ప్రాధాన్యం..

జిల్లాలో 5 వేల హెక్టార్లలో సేంద్రీయ వ్యవసాయానికి చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నామని, 16,425 హెక్టార్లలో మామిడి, దానిమ్మ, అరటి, టమోట వంటి పంటల సాగుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. 30 ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

చేనేత... పచ్చదనం

సోమందేపల్లి, హిందూపురంలో ఒక చేనేత అభివృద్ధి క్లస్టర్, ధర్మవరంలో మెఘా హ్యాండ్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. 1200 మినీ గోకులాలు ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తి పెంచామని అన్నారు. క్రమబద్ధీకరించిన వీర్య ప్రక్రియను అమలుచేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 5 నగర వనాలు, 5,020 హెక్టార్లలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచామని తెలిపారు.

ఇళ్లు... రహదారులు

ఉపాధి హామీ పథకానికి హౌసింగ్‌ని అనుసంధానం చేసి, నాలుగు గిరిజన ఆవాసాలను నిర్మించామని తెలిపారు. జిల్లాలో 40 వేల గృహాలను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రూ.71.22 కోట్లతో డ్వామా, పంచాయతీ రాజ్ శాఖ సహకారంతో 120.07 కి.మీ. తారు రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యాలతో జిల్లా వ్యాప్తంగా 54.86 కి.మీ. మేర రెండు లైన్ల రహదారిని నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

సత్యసాయి శతజయంతి..

నవంబరులో పుట్టపర్తిలో సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను పటిష్ఠంగా నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ముదిగుబ్బ నుంచి కదిరికి ఎన్‌హెచ్-42 ద్వారా నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కోసం రూ.427.26 కోట్లు కేటాయించారని తెలిపారు. కియ అనుబంధ పరిశ్రమల ద్వారా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోందని వివరించారు. కదిరి, మడకశిర నియోజకవర్గాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఎన్‌పీకుంట సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకి అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. జిల్లాలో 1000 మెగావాట్ల సామర్థ్యంతో రెండు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. పెనుకొండ, మడకశిర, లేపాక్షి, కదిరి, పుట్టపర్తిని ప ర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.

భద్రత పటిష్ఠం..

సీసీ కెమరాలు, డ్రోన్ల సాయం తో నిఘాపెట్టి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను పటిష్ఠం చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై అరాచకాలు తగ్గించే దిశగా, వారి హక్కులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. పోక్సో, నార్కోటిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నామని తెలిపారు. జిల్లా జీడీవీఏ 17.24 శాతం, జీడీడీపీ 17.83 శాతం, తలసరి ఆదాయంలో వృద్ధి 17.53 శాతం సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సత్యసాయి శత జయంతి వేడుకలు, టూరిజం అభివృద్ధికి ప్రభుత్వ సహకారం కావాలని కలెక్టర్ కోరారు. హంద్రీనీవా నుంచి పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లోని 193 చెరువులకు నీటిని సరఫరా చేయాలని కోరారు.



చదును చేసిన 18 ఎకరాల భూమి

బీదల ప్లాట్లు..!

- ఇంటి స్థలాల కోసం 18 ఎకరాల సేకరణ
- పట్టాలు రాశారు.. ఇవ్వడం మరిచారు
- ఆన్‌లైన్‌లో 550 మంది జాబితా
- నంబర్ కూడా తెలియని లబ్ధిదారులు
- సొంతింటి కల నెరవేరేనా..?

నల్లమాడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టా మంజూరైనట్లుగా లబ్ధిదారుల పేరు ఆన్‌లైన్‌లో ఉంటుంది. కానీ ఆ ప్లాటు ఎక్కడుందో, దాని నెంబర్ ఎంతో కూడా లబ్ధిదారులకు తెలియదు. దీంతో తమ సొంతింటి కల ఎప్పటికి నెరవేరుతుందోనని పలువురు లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజలకు ఇంటి ప్లాట్లు ఇవ్వడానికి గత వైసీపీ ప్రభుత్వం మండలకేంద్రంలో కొంత అసెన్డు భూమి, మరికొంత రైతుల నుంచి సేకరించింది. మొత్తం 18ఎకరాలు సేకరించారు. అందులో ఉన్న చిన్నగుట్టలు, రాళ్లను తొలగించి చదును చేశారు. ఇందుకు అప్పటి ప్రభుత్వం రూ.60లక్షలు మంజూరు చేసింది.

ఆన్‌లైన్‌లో జాబితా

అప్పటి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో దాదాపు 550మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని జాబితాను తయారు చేసి అధికారులు ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. అయితే వీరిలో కొంతమందికి మాత్రమే పట్టాలిచ్చారు. చాలమంది లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయి కానీ పట్టాలు మంజూరు చేయలేదన్న విమర్శలున్నారు. కాగా 550 పట్టాల జాబితాలో ఉన్న లబ్ధిదారులకు కేటాయించిన ప్లాటు నెంబర్ కానీ, స్థలం కాని ఇంతవరకు వారికి చూపించిన దాఖలాలు లేవు. ఆన్‌లైన్‌లో పేర్లున్న లబ్ధిదారులకు ఎప్పుడు పట్టా ఇచ్చి, స్థలం చూపి స్తారోననే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్లాట్ల కోసం లక్షలు ఖర్చు చేసి సేకరించిన భూమి నిరుపయోగంగా మారిందనే విమర్శలు వినవస్తున్నాయి. సర్వేనెంబర్ 52లో పట్టాలు మంజూరు చేశారు. ఇందులోకూడా కొంతమందికి మాత్రమే పట్టాలందించి, ఇళ్లు మంజూరు చేశారు. మరికొంతమందికి పట్టాలు రాశామంటున్నారేకానీ, పట్టాను ఇవ్వలేదు. పేదలకు ఇంటి స్థలం చూపించలేదని గత వారంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీనితోపాటు 18 ఎకరాల భూములో 550 మందికి పట్టాలు రాసి ఇంతవరకు ఏ ఒక్కరికి పట్టాలు ఇవ్వకుండా, స్థలం చూపించకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని, ఆర్సీపీ నాయకులు అధికారులను నిలదీశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈభూమిని జాబితాలో ఉన్న అర్హులకు ఇవ్వాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి: సునీత, డిప్యూటీ తహసీల్దార్

నల్లమాడలో గత ప్రభుత్వంలో ఇంటి పట్టాల కోసం లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో ఉన్న లబ్ధిదారులకు స్థలాలు చూపించలేదు. అయితే ఈ విషయం నాకు తెలియదు. నేను ఇటీవలే బాధ్యతలు చేపట్టా. దీనికి సంబంధించిన వివరాలు ఉన్నతాధికారులకు తెలిపి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.



ఆన్‌లైన్‌లో జాబితా



గత వైసీపీ పాలనలో నిరుపేదలందరికి ఇళ్లు మంజూరు చేస్తామని 18ఎకరాల పొలాన్ని చదును చేయడానికి, రూ.60లక్షలు ఖర్చు చేశారు. పట్టాలిస్తామని చెప్పారేకానీ, పట్టాలు లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేశారు. లబ్ధిదారులు పట్టాలున్నాయని ఆనందపడుతు న్నారు కాని వారి ప్లాటు ఎక్కడుందో వారికే తెలియదు. ఈ ప్రభుత్వమైనా ఆన్‌లైన్‌లో పేర్లు ఉన్న ప్రతి ఒకరికి పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించాలి.

- చంద్ర, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

అర్హులకు ఇవ్వండి

మండలంలో అర్హులైన పేదలందరికి ప్రభుత్వ పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించాలి. గత వైసీపీ పాలనలో ఐదేళ్లు పట్టాలు లేవు. ఇళ్లు లేవన్నారు. 18 ఎకరాల్లో పట్టాలు రాశారు. ఇళ్లు ఇవ్వడం మరిచారు. అలాగే 52 సర్వేలో పట్టాలు రాశారు. ప్లాట్లు ఇవ్వలేదు. వీరందరికి పట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలి. మండలకేంద్రంలో శ్మశాన వాటికకు కనీసం పది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలి.

- మగ్గం చంద్ర, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి

బడిలో రచ్చ

పీసీగిరి హైస్కూల్‌లో వీధికెక్కిన విభేదాలు

- ఉపాధ్యాయుల మధ్య ఆధిపత్య పోరు
- కలెక్టర్, డీఈఓలకు ఫిర్యాదు
- తల్లిదండ్రుల ఆగ్రహం



పీసీ గిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మడకశిర/గుడిబండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విద్యా బుద్ధులు నేర్పి, ఆదర్శవంతంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులు గ్రూపులుగా ఏర్పడి తరచూ వివాదాలు సృష్టిస్తున్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల మధ్య సఖ్యత కొరవడటమే సమస్యలకు కారణ మవుతోంది. ఉపాధ్యాయుల గొడవలతో తమ పిల్లల చదువు పాడైపోతోందని పలువురు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏడుగురే ఉన్నా రచ్చే..!

గుడిబండ మండలంలోని పీసీగిరి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య గొడవ రచ్చకెక్కుతోంది. వీరి మధ్య విభేదాల నేపథ్యంలో సమన్వయం కొరవడి పరీక్షల సమయంలో ఒక పరీక్షకు బదులు మరొకటి నిర్వహించారు. దీనిపై డీవైఈఓ ఆరా తీసి హెచ్‌ఎంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలోనే విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన చిక్కీలు, కోడి గుడ్లను నేలపాలు చేసిన సంఘటన కూడా చోటు చేసుకుంది. పాఠశాలలో హెచ్‌ఎంతో కలిపి ఏడుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 99 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు 26 మంది ఉన్నారు. ఆరో తరగతిలో 15 మంది, ఏడులో 18, ఎనిమిదిలో 16, తొమ్మిదిలో 26 మంది విద్యార్థులు ఉన్నారు.

గ్రూపులుగా ఏర్పడి..

పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు సంఖ్య తక్కువగా ఉన్నా కూడా వీరి మధ్య సఖ్యత లేకపోవడంతో గ్రూపులు కట్టారు. కొందరు ఉపాధ్యాయులతో కలిసి హెచ్‌ఎం ఒక గ్రూపుగా ఏర్పడగా మిగిలిన వారు మరో గ్రూపుగా ఏర్పడ్డారు. వీరు పాఠాలు చెప్పడం మాని ఆధిపత్య పోరులోనే నిమగ్నమైనట్లు గ్రామస్థులు విమర్శిస్తున్నారు. హెచ్‌ఎం, ఇంగ్లిష్ టీచర్‌తో కలిసి తమను వేధిస్తున్నారని గోపాల్ నాయక్, తులసీనాయక్ అనే ఉపాధ్యాయులు ఈ నెల 10న పుట్టపర్తి లో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. హెచ్‌ఎం సెలవు మీద వెళ్లినా, ఆఫీస్ పనిమీద వెళ్లినా ఇన్‌చార్జ్ బాధ్యతలు సీనియర్లకు కాకుండా జూనియర్ టీచర్లకు అప్పగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. పాఠశాలలో నియంతృత్వ పాలన నడుస్తోందని, హెచ్‌ఎం పాఠశాలకు వచ్చేంతవరకు బెల్లు కూడా కొట్టకూడదన్న నిబంధన విధించిందని పేర్కొన్నారు. ఎస్ఆర్ లు పెండింగ్ పెట్టి, ఇంక్రిమెంట్లు చేయడం లేదని, అటెండెన్స్ యాప్‌లో సెలవు పెడుతున్నా రిజెక్టు చేసి జీతం నిలుపుదల చేస్తు ఇబ్బంది పెడుతున్నారని హెచ్‌ఎంపై వారు ఫిర్యాదు చేశారు. వారి ఆరోపణల్లో నిజం లేదని, విధి నిర్వహణలో సహకరించడంలేదని హెచ్‌ఎం ఆరోపించారు.

విచారణ చేస్తాం: పద్మప్రియ, డీవైఈఓ

హెచ్‌ఎం, ఉపాధ్యాయుల మధ్య జరిగిన వివాదంపై కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై డీఈఓ విచారణకు ఆదేశించారు. త్వరలోనే పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయురాలు మధ్య జరిగిన వివాదం గురించి, విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం అందించే కోడిగుడ్లు, చిక్కీలను ప్రధానోపాధ్యాయని విద్యార్థులకు ఇవ్వలేదు. దీంతో అవి పాడైపోయాయి. ఈ సమాచారం ఉన్నతాధికారులకు ఇవ్వకుండానే భూమిలో పాతిపెట్టారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. ప్రధానోపాధ్యాయని సరిగ్గా లేనందువల్లే ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఒకరికొకరు గొడవ పడుతున్నారు. దీంతో విద్యార్థుల చదువు కుంటుపడింది.

- సాకమ్మ, పీసీ గిరి

వృత్తికే కళంకం



పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు వృత్తికే కళంకం తీసుకొచ్చేలా ప్రవర్తిస్తున్నారు. వాళ్లలో వారు గొడవ పడుతూ విద్యాబోధన మరిచి, పిల్లల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. పాఠాలు సక్రమంగా చెప్పకపోవడంతో విద్యాభివృద్ధి కుంటు పడింది. ప్రధానోపాధ్యాయు రాలిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

- పరమేష్, విద్యార్థి తండ్రి, పీసీగిరి

పది పరీక్షకు 252 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పదో తరగతి ఫిజికల్ సైన్స్ పరీక్షకు 252 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ కిష్టప్ప తెలిపారు. దీంతో 98.85 శాతం హాజరు నమోదైందన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్ష 609 మందికిగాను 491 మంది రాయగా.. 118 మంది గైర్హాజరయ్యారని డీఈఓ చెప్పారు.

తెలంగాణ వాదనతో సీమకు నష్టం

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి

- 7లో..



మాట్లాడుతున్న బొజ్జ దశరథ రామిరెడ్డి

కవ్వింపులు.. క్యాంపులు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీ అయిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు గురువారం ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందులోనూ వైసీపీ కవ్వింపులకు తెరలేపింది. తమ పార్టీ మద్దతు సభ్యులు ఎక్కడ చేజారిపోతారోనన్న ఆందోళనతో దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అంతేకాదు, తమ సభ్యులను ఇప్పటికే శిబిరాలకు తరలించింది. రామగిరి ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో బుధవారం ఆ మండల పరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ వర్గీయుల వాహనాలను వైసీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికపై సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఎక్కడ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతాయోనని యంత్రాంగం ఆందోళన చెందుతోంది. పోలీసులు పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

వివరాలు 6లో..



7

టీడీపీ, వైసీపీ ఘర్షణ

కవ్వింపులు... క్యాంపులు

- ఉప ఎన్నికల్లోనూ వైసీపీ కుట్రలు
- నేడు ఖాళీపడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి
- అధికారుల నియామకం
- ఉమ్మడి జిల్లాలో 5 ఎంపీపీ, నాలుగు చొప్పున వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ ఖాళీలు
- రామగిరిలో ఘర్షణ
- టీడీపీ వర్గీయుల వాహనాలు ధ్వంసం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అరెస్టు
- కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



జడ్పీ కార్యాలయం

పుట్టపర్తి/అనంతపురం విద్య, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖాళీపడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్ స్థానాలకు నిర్వహిస్తున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు కవ్వింపులకు పాల్పడుతున్నారు. ఆయా పదవులను దక్కించుకోడానికి ఘర్షణలు, దాడులకు దిగుతున్నారు. దీంతో రెండు పార్టీల నేతల మధ్య ఘర్షణలు తలెత్తుతున్నాయి. రామగిరిలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య వాగ్వాదం, ఘర్షణ ఆఖరికి దాడుల వరకూ వెళ్లింది. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని సోమందేపల్లిలో అరెస్టు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9 మండలాల్లో ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో హైటెన్షన్ నెలకొంది. అలాగే నాలుగు ఉప సర్పంచ్ స్థానాలకూ ఎన్నిక నిర్వహించనున్నారు.

టీడీపీ వెంట వస్తారనే...

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక చాలాచోట్ల వైసీపీ నుంచి నాయకులు కూటమి వైపు వస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు సైతం అడుగేస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కవ్వింపు చర్యలతోపాటు, దాడులకు దిగుతున్నారు. రామగిరిలో ఇదే జరిగింది. బుధవారం రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు రెచ్చగొట్టడంతో ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో పరస్పర దాడులు కారణంగా ఇరువర్గాల వాహనాలు ధ్వంసమయ్యాయి. సోమందేపల్లిలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఎన్నికలు సజావుగా సాగకుండా చేయాలనే కుట్రలో భాగంగా వైసీపీ మూకలు ఇలా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. రెండు జిల్లాల అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలు కూడా అమర్చారు.

9 స్థానాలకు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 9 స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల పలు కారణాల వల్ల ఖాళీ పడిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు నేడు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 5 ఎంపీపీ, 4 వైస్ ఎంపీపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి ఉప ఎన్నికల నిర్వహణకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జడ్పీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే 9 మండలాలకు ఎన్నికల అధికారులను నియమించారు. గురువారం ఉదయం 10 నుంచి ఒంటి గంట మధ్య ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. తొమ్మిది మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికలు నిర్వహించనున్నారు.

రామగిరిలో..

రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలుండగా.. 9 వైసీపీ, ఒకటి టీడీపీ నెగ్గింది. వైసీపీ నుంచి ఎంపీపీగా ఎన్నికైన నాగమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వైసీపీ నుంచి ఎన్నికైన సభ్యుల్లో ముగ్గురు టీడీపీ వైపు మొగ్గుచూపినట్లు సమాచారంతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. గురువారం నేరుగా ఎంపీటీసీలను మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చేలా వైసీపీ నాయకులు ఎత్తుగడ వేశారు. ఈనేపథ్యంలో బుధవారం విప్ జారీ చేయాలంటూ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన వైసీపీ నాయకులు.. టీడీపీ వర్గీయుల వాహనాలను ధ్వంసం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎంపీపీ ఎంపికపై ఉత్కంఠ నెలకొంది.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఉప ఎన్నిక నిర్వహించే స్థానాలు..

జిల్లా	ఎంపీపీ స్థానాలు	వైస్ ఎంపీపీ స్థానాలు
అనంతపురం	కణేకల్లు కంబదూరు	ఉరవకొండ-2 యల్లనూరు పెద్దపప్పూరు రాయదుర్గం
శ్రీసత్యసాయి	గాండ్లపెంట రొద్దం రామగిరి	

నాలుగు ఉప సర్పంచ్ స్థానాలకూ..

ఉమ్మడి జిల్లాలో నాలుగు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ స్థానాలకు గురువారం ఎన్నిక నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లాలో పామిడి మండలం రామగిరి, వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఉప సర్పంచ్ స్థానానికి ఎన్నిక నిర్వహించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో పెనుకొండ మండలం రాంపురం, మడకశిర మండలం కల్లుమర్రి ఉప సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

గాండ్లపెంటలో..

మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఎంపీపీ జగన్మోహన్ రాజీనామాతో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఐదుగురు వైసీపీ, ఇద్దరు టీడీపీ మద్దతుదారులు ఉన్నారు. వైసీపీ మద్దతుదారుల్లో ఇద్దరు టీడీపీకి అనుకూలంగా ఓటేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ టీడీపీ మద్దతు అభ్యర్థే అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. వైసీపీ మద్దతుతో గెలిచి, సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ఎంపీటీసీ సభ్యుడిని ఎంపీపీగా ఎన్నుకునే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన నలుగురిని క్యాంపునకు తరలించారు.

వైసీపీలోనే వార్

రొద్దం ఎంపీపీ ఎన్నిక విషయంలో వైసీపీలోనే వార్ నడుస్తోంది. స్థానాన్ని కైవశం చేసుకునేందుకు వైసీపీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. రొద్దం మండలంలో ఉశశ్రీ వర్గం ఒకవైపు, శంకర్‌నారాయణ వర్గం ఒకవైపు తమ వర్గానికి ఎంపీపీ స్థానం దక్కాలంటూ ఎవరికి వారు పావులు కదుపుతున్నారు. పెనుకొండ మండలంలోని రాంపురం పంచాయతీలోని వార్డు సభ్యురాలు నవతాబాయి కొంతకాలం క్రితం రాజీనామా చేశారు. ఏడాది క్రితం రొద్దం ఎంపీపీ చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతిచెందారు. రొద్దం మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఎంపీపీ మృతితో 14 మంది ఉన్నారు. వారిలో ఉషశ్రీ వర్గీయులు నలుగురు, శంకర్ నారాయణ వర్గానికి చెందిన ఏడెనిమిది మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీపీ స్థానం ఎస్సీకి రిజర్వ్ కావడంతో కలిపి ఎంపీటీసీ వనజ, చిన్నమంతూరుకు చెందిన నాగమ్మ ఎంపీపీ బరిలో ఉన్నారు. నాగమ్మ పేరు ప్రస్తావనలో ఉన్నట్లు తెలుస్తోంది. నాగమ్మ, వనజలో ఎవరు ఎంపికవుతారని ఉత్కంఠ నెలకొంది.

కంబదూరులో..

ఎంపీపీగా రెండున్నరేళ్ల పాటు కొనసాగిన తలారి తిమ్మరాజమ్మ రాజీనామా ఇవ్వడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మండలంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. వారిలో ఒకరు మృతిచెందారు. దీంతో 14 మంది ఎంపీటీసీ సభ్యులతో ఎంపీపీని ఎన్నుకుంటారు. వీరంతా వైసీపీ మద్దతులోనే గెలిచారు. తమ సభ్యులు ఎక్కడ జారిపోతారోనన్న భయంతో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. 10 మంది ఎంపీటీసీ సభ్యులను నాలుగు రోజుల క్రితమే విహారయాత్రకు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఈనెల 25న ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఒక్క సభ్యుడు కూడా హాజరుకాలేదు. మొత్తం సభ్యుల్లో నలుగురు టీడీపీతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఆ నలుగురే కీలకంగా మారి, మిగతా ఎంపీటీసీ సభ్యులను టీడీపీ వైపు తీసుకొచ్చే అవకాశాలు లేకపోలేదు. దీంతో ఆ నలుగురి కదలికలపై వైసీపీ నాయకులు నిఘా వేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ కండువా వేసుకుని, ఆ పార్టీకి మద్దతు ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మండలంలోని రాళ్లఅనంతపురం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు కురుబ లక్ష్మీదేవమ్మను ఎంపీపీగా ఎన్నుకునే అవకాశాలున్నాయి.

ముందస్తు ఎన్నిక

కణేకల్లు ఎంపీపీగా పనిచేసిన సంధ్య రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటిలో 17 స్థానాలను వైసీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఒకచోట టీడీపీ మద్దతు అభ్యర్థి గెలిచారు. ఈ నేపథ్యంలో ఎంపీపీగా వైసీపీ మద్దతు అభ్యర్థి ఎన్నికవడం ఖాయంగా కనిపిస్తోంది. ఎంపీపీ ఎస్సీ జనరల్ రిజర్వేషన్ కేటాయించారు. ఒకరు రాజీనామా చేయగా.. ఇంకా ఇద్దరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సభ్యులున్నారు. వారిలో ఎవరిని ఎంపీపీ చేయాలన్న విషయమై వైసీపీ నేతల ఆధ్వర్యంలో మండలంలోని ఓ గ్రామంలో ఎన్నిక నిర్వహించుకున్నట్లు తెలిసింది. గరుడచేడు ఎంపీటీసీ సభ్యుడు వంద్రయ్యకు 12 మంది, మరో ఎంపీటీసీకి ఇద్దరు మాత్రమే మద్దతు తెలిపారు. దీంతో వంద్రయ్య ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9 మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలకు ఏర్పాట్లు చేశాం. ఎన్నికల, ప్రిసైడింగ్ అధికారులను నియమించాం. ఎన్నికలున్న అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు వీడియోగ్రఫీ కూడా తీయిస్తున్నాం. ఎన్నికలు సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం.

-రామచంద్రారెడ్డి, జడ్పీ సీఈఓ, అనంతపురం

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ రత్న



జిల్లాలో ఎంపీపీ, ఉపసర్పంచ్ ఎన్నికల సందర్భంగా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న హెచ్చరించారు. గురువారం జిల్లాలో మూడు ఎంపీపీ, రెండు ఉపసర్పంచ్ స్థానాలకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నిక సమయంలో 30 పోలీసు యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉంటాయన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా పెడతామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

నేడు సతామి

- రంజాన్ మాసంలో పవిత్రమైన రోజుగా ముస్లింల విశ్వాసం
- ఖురాన్ గ్రంథం దివి నుంచి భువికి వచ్చిన రోజు
- ఉపవాసం, జాగరణ చేయనున్న ముస్లింలు



పుట్టపర్తి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 27వ రోజు సతామీ (లైలతుల్ ఖద్ర్)గా చేసుకుంటారు. ప్రస్తుత రంజాన్ మాసంలో గురువారం సతామీ నిర్వహించుకుంటారు. ఈ రోజున పవిత్ర గ్రంథం ఖురాన్ దివి నుంచి భువికి వచ్చినట్లు ముస్లింలు భావిస్తారు. ఆరోజు రాత్రి జాగరణ, ప్రార్థనలు చేస్తూ గడుపుతారు. ఈ ఒక్కరాత్రి భక్తితో ప్రార్థనలు చేసేవారికి 83 ఏళ్ల ప్రార్థనలు చేసిన ప్రతిఫలం దక్కుతుందని ముస్లింల నమ్మకం. ఈ రాత్రిచేసే ప్రార్థనల వల్ల సర్వపాపాలు తొలగిపోతాయని భావిస్తారు. రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాసం, జకాత్, ఫిత్రా, తర్జావీలను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో గురువారం సతామీకి ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉపవాస దీక్ష ఎందుకంటే..

రంజాన్ నెలలో సన్మార్గంలో నడుస్తూ పరిశుద్ధమైన జీవనం సాగించాలన్నదే ఇస్లాం మత ముఖ్య ఉద్దేశం. అలాంటి మాసంలో సూర్యోదయం ముందు నుంచీ సూర్యాస్తమయం వరకు ఆధ్యాత్మిక చింతనతో ఘన, ద్రవ, పదార్థాలు తీసుకోకుండా ఉంటారు. తద్వారా ఆకలి బాధ తెలుస్తుంది. అకలితో అలమటించే పేదవాడి బాధను తెలుసుకుని, వారికి సాయం చేయాలన్న దృక్పథం ఏర్పడుతుందని ముస్లింల నమ్మకం. అలాంటి విశ్వాసంతో భగవంతుడిపై నమ్మకం ఉంచి, నమాజ్ చేయాల్సి ఉందనీ, అది ఆధ్యాత్మిక జీవనం సాగించేందుకు దోహదపడుతుందని కఠోర ఉపవాసం చేస్తారు.

జకాత్..

ఇస్లాం ఐదు మూలస్తంభాల్లో నాలుగోది జకాత్. దీని అర్థం తన ఆదాయంలో కొంత భాగాన్ని అవసరమనుకున్న పేదవారికి పంచిగానీ, సాయంచేసిగానీ సంపదను ధార్మికం చేసుకోవడం. ప్రతి ముస్లిం తన సాంవత్సరిక ఆదాయం, ధనంలో 2.5 శాతం అల్లాహ్ మార్గంలో అవసరమున్న వారికి, పేదవారికి దానం చేయాలి. ఈ ధార్మిక విధానాన్ని జకాత్ అంటారు. ఇది మోక్షమార్గదారుల్లో ఒకటిగా చెప్పుకుంటారు.

ఫిత్రా..

ఈ పదానికి అర్థం మానవునిలో గల ప్రాకృతిక ధర్మం తనతోపాటు ఇతరులకు సంతోషాన్ని ఇవ్వడం. ఆ ప్రాకృతిక ధర్మం ప్రతి మనిషిలో ఉంటుందనీ, దీని ప్రకారం మానవుడిని దైవమార్గాన, భాగ్యం కల్పించడం, ప్రముఖంగా ఈ ఫిత్రాను రంజాన్ పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనల ముందే పేదలు, అభాగ్యులకు ఇచ్చేదానం, ప్రతి ముస్లిం కనీసం ఇవ్వవలిసిన దానం. ఇది పండుగకు ముందురోజునే ఇవ్వాలి. ఎందుకంటే పేదవారు కూడా పండుగ అనందంగా చేసుకోవడానికి అది ఉపయోగపడాలి. ఇది కుటుంబంలోని ప్రతి సభ్యుడు తప్పక ఇవ్వాల్సిన ధర్మం. దేవుడి పట్ల కృతజ్ఞతగా ఇవ్వాలి.

తర్జావీ ఖురాన్ పఠనం

రంజాన్ మాసం ప్రారంభమైన మొదటి రోజు నుంచీ ప్రతిఒక్కరూ రాత్రి ప్రత్యేక ప్రార్థనలతోపాటు దివ్య ఖురాన్ పఠనం చేయాలి. అంతేగాక ఎతిఖాఫ్ పాటించాలి. అంటే లైలతుల్ ఖద్ర్ నాటి నుంచి పూర్తిగా కుటుంబానికి దూరంగా మసీదులోనే ఉంటూ ఆధ్యాత్మిక చింతనలోనే పండుగ రోజు వరకు గడపాలి. తద్వారా అంతులేని పుణ్యఫలాలు లభిస్తాయనీ, తను నివసిస్తున్న గ్రామం, పట్టణం సుభిక్షంగా ఉంటుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

దర్యాప్తు స్టేటస్ రిపోర్టు మా ముందుంచండి: హైకోర్టు

అమరావతి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండగా న్యాయవాది బీవీ శేషాద్రి మృతిచెందిన వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసు దర్యాప్తు స్టేటస్ రిపోర్ట్‌ను తమ ముందు ఉంచాలని పోలీసులకు స్పష్టం చేసింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర డీజీపీ, అనంతపురం జిల్లా ఎస్పీ, అనంతపురం మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు నోటీసులు జారీచేసింది. పోలీసులు సమర్పించే నివేదిక సంతృప్తికరంగా లేకుంటే సీబీఐ విచారణకు ఆదేశిస్తామని స్పష్టం చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది బీవీ శేషాద్రి గతేడాది డిసెంబరులో మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉండగా మరణించారు. ఈ ఘటనపై హైకోర్టు పర్యవేక్షణలో మేజిస్ట్రేట్‌తో విచారణ జరిపించి, నిర్దేశిత గడువులోగా నివేదిక సమర్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ అధీకృత ప్రతినిధి జి.రంగనాయకులు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. న్యాయవాది మృతిపై అనుమానాలున్నాయని సోదరి ఫిర్యాదు చేసిందని చెప్పారు. ఘటన జరిగిన రోజు పోలీస్‌స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వాలని కోరగా, పోలీసులు నిరాకరిస్తున్నారన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఘటనపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

పారదర్శకతకు పాతర..!

- డ్వామా బదిలీల్లో విచిత్రాలు
- ఆ 8 మంది ఏపీఓలు తిరిగి తెరపైకి..
- వైసీపీ హయాంలో నిబంధనలకు తూట్లు
- అదే బాటలో హెచ్‌ఆర్ విభాగం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్‌ఓ, డ్వామా పీడీ (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డ్వామాలో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా చేస్తున్నామంటూనే కొందరు అధికారులు కౌన్సెలింగ్‌ను అనుకూలంగా మార్చుకున్నారు. తమకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులను ఎంచుకున్న స్థానంలోకి చేర్చడానికి డ్వామాలో హెచ్‌ఆర్‌తో పాటు కొందరు అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. పేరుకే కౌన్సెలింగ్ జరిగిందని, తెరవెనుక వేరే వ్యవహారాలు నడిచాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులకు ఎందుకంత ప్రేమో అన్న చర్చ జరుగుతోంది. ఏళ్లుగా పాతుకుపోయినా అదే స్థానంలో కొనసాగించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లు ఇలా ఉద్యోగుల బదిలీల్లో చిత్రవిచిత్రాలు కనబడుతున్నాయి. టీఏలలో చివరిలో ఉండే వ్యక్తికి జిల్లా కేంద్రంలోని స్థానాన్ని ఎలా కేటాయిస్తారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక సరిహద్దులోని ఓ మండలంలో పనిచేస్తున్న ఉద్యోగి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండే మండలానికి రావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తోటిఉద్యోగులే చెబుతున్నారు. ఇందుకు హెచ్‌ఆర్‌తో పాటు పలువురు అధికారులు సహకస్తున్నారని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో క్షేత్ర స్థాయిలో పనిచేయాల్సిన ఏపీఓ, ఈసీ, టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లు సుమారు 25 మందికి పైగా పీడీ కార్యాలయానికి అక్రమమార్గంలోనే డెప్యుటేషన్ పేరుతో వచ్చారు. ఇటీవల జరిగిన బదిలీల్లో వారిని కదిలించకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తాజా బదిలీల్లో విచిత్రాలు

డ్వామాలో ఇటీవల చేసిన బదిలీల్లో అన్నీ విచిత్రాలే కనిపిస్తున్నాయి. హెచ్‌ఆర్ విభాగంలో ఉన్న ఉద్యోగులే బదిలీలను శాసించారు. డ్వామా కీలక అధికారిని కీలుబొమ్మగా మార్చేసి కొందరు అధికారులు వారి కనుసన్నల్లోనే కౌన్సెలింగ్ చేపట్టినట్లు తెలుస్తోంది. టెక్నికల్ అసిస్టెంట్లలో చివరిలో ఉండే వారికి సైతం జిల్లా కేంద్రానికి అతిసమీపంలో స్థానం కల్పించారు. మొదటి వరుసలో ఉన్నవారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీలకు ముందురోజే వ్యూహాత్మకంగా తమ ప్రణాళికను అమలు చేశారని ఉద్యోగులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అనంతపురం రూరల్, కూడేరులో ఈసీ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ జాబితాలో చూపలేదు. హెచ్‌ఆర్‌లో ఒకరు ఆరేళ్లు, మరొకరు ఎనిమిదేళ్లుగా ఒకే స్థానంలో ఉంటూ డ్వామాను శాసిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తెరపైకి ఆ 8 మంది బదిలీలు..

గత సంవత్సరం ఆగస్టులో అప్పటి పీడీ ఎనిమిది మంది ఏపీఓలను బదిలీ చేశారు. ఎందుకు, ఎవరి సిఫారసుతో బదిలీ చేశారో అర్థం కాని పరిస్థితి. ఆ ఎనిమిది మంది ఏపీఓలకు స్థానచలనం కల్పించాలని డ్వామా అధికారులు యత్నిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో బదిలీ అయిన వారిలో పుట్లూరు నుంచి బొమ్మనహాల్‌కు భాగ్యలక్ష్మి, ఆత్మకూరు ఏపీఓ పుష్పావతి కళ్యాణదుర్గానికి బదిలీ చేయగా విధుల్లో చేరారు. మిగిలిన వారిలో.. పీడీ కార్యాలయంలో డెప్యుటేషన్‌పై ఉన్న ఆదినారాయణమ్మను తాడిపత్రికి, రాప్తాడు ఏపీఓ ఓబన్నను డి.హీరేహాల్‌కు, కూడేరు ఏపీఓ సుజాతను కంబదూరుకు, గార్లదిన్నె ఏపీఓ మురళీకృష్ణను బెళుగుప్పకు, తాడిపత్రి ఏపీఓ రాజ్యలక్ష్మిని బ్రహ్మసముద్రానికి, పామిడి ఏపీఓ విజయభారతిని రాయదుర్గానికి బదిలీ చేశారు. ఆ ఎనిమిది ఏపీఓలు బదిలీపై వెళ్లేందుకు ఇప్పటికే స్థానాలు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఆయా స్థానాల్లో వేరే ఏపీఓలు ఉన్నా సరే.. వాళ్లను వేరు మండలాలకు పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. నార్పలలో ఇద్దరు ఏపీఓలు ఉండగా.. ఒకరిని పంపాలని చూస్తున్నారు. బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె, శింగనమల, యల్లనూరు మండలాలకు వారిలో ఐదుగురు ఏపీఓలను రప్పించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో బదిలీల నిబంధనలను తుంగలోతొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇప్పుడు కూడా అదేబాటలో పయనించడంపై కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం



డ్వామాలో అన్నీ నిబంధనల ప్రకారమే చేస్తున్నాం. ఇన్‌చార్జిలు, డెప్యుటేషన్లు, బదిలీలు ఇలా ప్రతిదీ సీఆర్‌డీ, జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి పొందాకే అమలు చేస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా చేయడానికి అవకాశమే లేదు. సీఆర్‌డీ గైడ్‌లైన్స్ ప్రకారమే ఉపాధి ఉద్యోగులను కౌన్సెలింగ్ ద్వారా స్థానచలనం కల్పించాం. గతంలో జరిగిన పరిణామాలకు ప్రస్తుతం పారదర్శకంగా చేపట్టే బదిలీలకు సంబంధం లేదు.

- సలీంబాషా, పీడీ, డ్వామా

ఇంటి నుంచే ఉపాధి

- సర్వే చేపట్టిన ప్రభుత్వం
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు



సర్వేలో భాగంగా వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగి

ధర్మవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపాధి అవకాశాల పెంపు పట్ల రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇంటి వద్ద నుంచే ఆదాయం పొందేలా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు 15 రోజులుగా జిల్లాలో ఇంటింటికి వర్క్‌ఫ్రం హోమ్ సర్వే చేపడుతున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా సచివాలయ సిబ్బంది వారి పరిధిలో గల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు వారిని ఈ సర్వేలోకి తీసుకుంటున్నారు. ఇంట్లో కుటుంబసభ్యులు ఎంతమంది ఉన్నారు. వారిలో చదువుతున్న వారు ఎంతమంది, విద్యార్హతలు, ఏమిటి అనే వివరాలు సేకరి స్తున్నారు. ఇంజనీరింగ్ చదివితే ఉద్యోగం చేస్తున్నారా? ఏ రంగానికి చెందిన వారు సాఫ్ట్‌వేర్‌కు అయితే ఇంటి వద్ద నుంచి పని చేసుకునే ఆసక్తి ఉందా లేదా అనే అంశాలు పరిగణలోకి తీసుకుంటున్నారు. చేతి వృత్తుల్లో అయితే వడ్రింగి, కరెంటు, తాపీమేస్త్రీ, కుట్టుమిషన్, రజకులు, దర్జీ పనులు, కంప్యూటర్లు, టీవీలు, సెల్‌ఫోన్ రిపేరీ చేసేవారు.. బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుని ఖాళీగా ఉన్నవారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుత సర్వే ప్రకారం కొత్తగా వివాహమై అత్తారింటికి లేదా భర్త పని చేసే ప్రాంతానికి వచ్చి ఖాళీగా ఉన్నవారికి వర్క్ ఫ్రం హోమ్ ఎంతో ఉపయోగపడుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు రద్దవుతాయేమోనని, పింఛన్లు ఆగిపోతాయేమోనని చాలా మంది ఈ సర్వేలో వివరాలు చెప్పడానికి వెనుకడుగు వేస్తున్న ట్లు సమాచారం. ఏ ఒక్కరికీ ఈ సర్వే వల్ల నష్టం ఉండదని, ప్రజల వ ద్దకు వచ్చే సర్వే సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

పది రోజుల్లో పూర్తి

జిల్లా వ్యాప్తంగా వర్క్‌ఫ్రం హోమ్ ఇంటింటి సర్వే జరుగుతోంది. ఇప్ప టికి 70శాతం పూర్తయింది. మరో పది రోజుల్లో మొత్తం పూర్తవుతుంది. ఈ సర్వే పూర్తయితే ప్రతి ఇంటి సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తాం. వీటి ద్వారా ప్రభుత్వ పథకాలను కూడా అర్హులైన వారికి అందజేసేందుకు వీలుంటుంది. ప్రతి ఒక్కరు ఈ సర్వేకు సహకరించాలి.

- సుధాకర్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్

అంతా ఆన్‌లైన్‌లోనే జరగాలి

ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి శివనారాయణశర్మ



మహాజన సభలో మాట్లాడుతున్న శివనారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సొసైటీల్లో కార్యకలాపాలు, లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని, మ్యాన్‌వల్‌గా చేస్తే ఒప్పుకునేది లేదని ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీ బ్యాంకు 128వ మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏప్రిల్ 1 నుంచి సొసైటీలలో కార్యకలాపాలు, లావాదేవీలు అన్ని కంప్యూటర్ ద్వారా మాత్రమే జరగాలని, ఇందుకు సంబంధించి సొసైటీల సీఈఓలు, పర్సన్ ఇన్‌చార్జిలు, సూపర్‌వైజర్లు, సంబంధిత సహకార శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. డిపాజిట్లు సేకరించాలని, వాయిదా మీరిన రుణాలపై త్వరితగతిన లీగల్ కవరేజ్ పూర్తి చేసి మొండి బకాయిలు వసూలు చేయాలని సూచించారు. ఇక నుంచి ఆన్‌లైన్ రసీదులు మాత్రమే చెల్లుబాటవుతాయన్నారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.167.5కోట్లు బడ్జెట్‌ను మహాజనసభ ఆమోదించింది. కార్యక్రమంలో రెండు జిల్లాల డీసీఓలు అరుణ కుమారి, కృష్ణానాయక్, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, నాబార్డు డీడీఎం అనురాధా, అధికారులు పాల్గొన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద చిన్నతరహా పరిశ్రమల రుణాలకు ఉమ్మడి జిల్లాలోని మైనార్టీలు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చిన్నతరహా పరిశ్ర మలను రెండు కేటగిరీలుగా విభజించి రుణాలు ఇస్తారన్నారు. తయారీ రంగానికి సంబంధించి రూ. 50 లక్షలు, సేవా రంగానికి సంబంధించి రూ. 20 లక్షలు రుణాలు ఇస్తారన్నారు. ఈ రుణాలకు సంబంధించి 15 నుంచి 40 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. అర్హులైన మైనార్టీలు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9849901138కు సంప్రదించాలన్నారు.

టీడీపీ, వైసీపీ ఘర్షణ

- ఇరు పార్టీల వారి వాహనాలు ధ్వంసం
- ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో రామగిరిలో ఉద్రిక్తత
- పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ రత్న



ఘర్షణ పడుతున్న టీడీపీ, వైసీపీ వర్గీయులు

రామగిరి/సోమందేపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య బుధవారం జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఉద్రిక్తత ఏర్పడింది. రామగిరి ఎంపీపీ మీనిగ నాగమ్మ అనారోగ్యంతో ఏడాది కిందట మరణించారు. దీంతో రామగిరి ఎంపీపీ పదవికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నిక గురువారం జరగనుంది. ఈ నేపథ్యంలో వైసీపీ వర్గీయులు విప్ జారీ చేసేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో టీడీపీ వర్గీయులు కూడా ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. ఒకరికొకరు ఎదురుపడటంతో మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. టీడీపీ వర్గీయుల వాహనం అద్దాలను వైసీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ వర్గీయులు కూడా వైసీపీ వాహనాలను ధ్వంసం చేశారు. విప్ జారీ చేసేందుకు వచ్చిన హరినాథ్‌రెడ్డి, రాప్తాడు జడ్పీటీసీ రామాంజనేయులు, లీగల్ సెల్ నాగిరెడ్డిలపై దాడి చేశారు. వారు కూడా టీడీపీ వర్గీయులపై దాడిచేశారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్, రామగిరి, ధర్మవరం వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి ఎస్ఐలు రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఘర్షణకు పాల్పడిన వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో తమపైకి దాడికి వచ్చారంటూ టీడీపీ వర్గీయులు ఆందోళనకు దిగారు. పోలీసులు వారికి నచ్చజెప్పి, నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎస్పీ రత్న రామగిరికి చేరుకుని సంఘటనపై ఆరాతీశారు. ఎంపీపీ ఎన్నిక సజావుగా సాగేలా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సంఘటనలపై ఇరువర్గాల ఫిర్యాదులు తీసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎన్నికల బందోబస్తు, నిర్వహణపై సమీక్షించారు. పేరూరు-2 ఎంపీటీసీ భారతిని బలవంతంగా వైసీపీ నాయకులు తీసుకెళ్లారంటూ వారి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీ కొత్తపల్లికి చెందిన గంగయ్య, గంగరత్నమ్మ ఫిర్యాదులు చేసినట్టు పోలీసుల తెలిపారు.



వైసీపీ వర్గీయుల వాహనంలో కొడవలి

ఎంపీపీ ఎన్నిక... భారీ బందోబస్తు

ఎంపీపీ ఉప ఎన్నిక గురువారం జరగనుంది. ఈనేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రత రామగిరిలోనే ఉండి బందోబస్తు పర్యవేక్షించారు. డీఎస్పీ హేమంత్‌కుమార్‌తోపాటు ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 35 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 100 మంది కానిస్టేబుళ్లు, 40 మంది హోంగార్డులు, రెండు ప్లటూన్స్ బలగాలను దించారు.

తోపుదుర్తి అరెస్టు.. విడుదల..

రామగిరిలో ఘర్షణ గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి తన అనుచరులతో బెంగళూరు నుంచి బయలుదేరారు. మార్గమధ్యలో ఆయనను పోలీసులు సోమందేపల్లి వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై అడ్డుకున్నారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పెనుకొండ, గోరంట్ల సీఐలు రాఘవన్, శేఖర్ సిబ్బందితో ప్రకాశ్ రెడ్డి వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం ఆయనను, అనుచరులను సోమందేపల్లి స్టేషన్‌కు తరలించారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, పార్టీ కార్యకర్తలతో స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ప్రకాశ్ రెడ్డిని ఎందుకు స్టేషన్‌కు తీసుకొచ్చారని పోలీసులను ప్రశ్నించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని డీఎస్పీ వివరించారు. పోలీసులు ప్రకాశ్ రెడ్డిని రెండు గంటలపాటు విచారించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసుల సూచన మేరకు ఆయన బెంగళూరుకు తిరిగి వెళ్లిపోయారు.



తోపుదుర్తిని అరెస్టుచేసి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ప్రశాంత గ్రామాల్లో చిచ్చుకు యత్నం: పరిటాల సునీత



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చిచ్చుపెట్టాలని చూస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరిలో బుధవారం మధ్యాహ్నం జరిగిన సంఘటనపై ఆమె విలేకరుల సమావేశంలో తీవ్రంగా స్పందించారు. ఎంపీపీ ఎన్నిక విషయంలో మా సభ్యుల బలంలేదని అలాంటప్పుడు ఇందులో మా జోక్యం ఎందుకు ఉంటుందని ఆమె ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వచ్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలను వైసీపీ వారు రెచ్చగొట్టారన్నారు. పథకం ప్రకారమే వాహనాల్లో మారణాయుధాలు తెచ్చారని ఆమె ఆరోపించారు. మొన్నటిరోజు మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం చేయించారని, ఇటీవల గ్రామాల్లో మళ్లీ ఫ్యాక్షన్ కక్షలు రేపుతున్నారని ప్రకాష్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

తెలంగాణ వాదనతో సీమకు నష్టం

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జ దశరథరామిరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న వాదనతో కృష్ణా జలాల్లో సీమకు నష్టం జరిగే ప్రమాదముందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జలాలను కోస్తా ప్రాంతానికి తరలించి అక్కడ ఆదా అయిన నీటిని శ్రీశైలంలో నిల్వ చేసి, వాటిని రాయలసీమకు మళ్లించడమే సరైన మార్గమని అన్నారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జలసాధన సమితి ఆధ్వర్యంలో 'రాయలసీమ నీటి ప్రాజెక్టులు-వెనుకబాటుతనం' అనే అంశంపై బుధవారం సమావేశం నిర్వహించారు.

జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బొజ్జ దశరథరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గోదావరి జలాలను బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించి రాయలసీమకు నీళ్లుఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారన్నారు. ఇందులో రెండు సమస్యలు ఇమిడి ఉన్నాయన్నారు. మొదటిది ఎక్కువ ఖర్చుతో కూడుకున్న అంశమన్నారు. బొల్లాపల్లి నుంచి బనకచర్లకు తరలించేందుకు సుమారు రూ.38 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారన్నారు. అయితే ఈ మొత్తాన్ని రాయల సీమలోని పెండింగ్ ప్రాజెక్టులు, కాలువ పనులు పూర్తి చేయడానికి ఉపయోగిస్తే 15 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వచ్చన్నారు. రెండో అంశం గోదావరి బనకచర్ల ప్రాజెక్టుల వల్ల ట్రిబ్యునల్లో అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న వాదన వల్ల కృష్ణా జలాల్లో నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. 1988 సంవత్సరం లో హంద్రీనీవా ప్రాజెక్టుకు నిర్దేశించిన విధంగా ఆరు లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడంలో డిజైన్ లోపం వల్ల ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ చేయడం వల్ల శాశ్వతంగా నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. లైనింగ్ పనులను వెంటనే రద్దు చేయాలన్నారు. హంద్రీనీవా మెయిన్ కాలువ 10 వేల క్యూసెక్కులకు వెడల్పు చేసి పిల్ల కాలువ వ్యవస్థ ద్వారా ఆరు లక్షల ఎకరాలకొత్త ఆయకట్టుకు నీరివ్వాలని కోరారు.

సమావేశంలో జల సాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, సహకార్యదర్శి ప్రకాష్, ఇఫ్ టు అధ్యక్షులు ఏసురత్నం, విద్యావంతుల వేదిక వెంకటేష్, నాయకులు రాహుల్, లక్ష్మి, వీరేంద్ర, వేమయ్య, పెద్దన్న, వీరు నారప్ప, అరుణోదయ చంద్ర, ఉమ్మడి కర్నూలు జిల్లా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు వైఎస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

అనంతపురం టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీచేస్తున్న ఎఫ్‌ఎన్ఓ, వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి అర్హుల ప్రొవిజనల్ జాబితాను వైద్యశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి తెలిపారు. ఏమైన అభ్యంతరాలు ఉంటే గురువారం సాయంత్రంలోగా ఆధారాలతో తెలియజేయాలని బుధవారం ఓప్రకటనలో కోరారు.

డీఎస్సీ శిక్షణకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రేపటిలోగా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం షార్ట్‌లిస్ట్ చేసిన ఫేజ్-2 ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా https://mdfc.apcfss.in వెబ్‌పోర్టల్‌లో ఉంచామన్నారు. షార్ట్‌లిస్ట్‌లో పేరు ఉన్న అభ్యర్థులు వారి ప్రాధాన్యం మేరకు శుక్రవారంలోపు అన్ని కోచింగ్ సంస్థలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు.

చీనీ టన్ను రూ.25 వేలు



అనంతపురం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.2,600, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 947 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయండి

- లోక్‌సభలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



ప్రసంగిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ బుధవారం లోక్‌సభలో కోరారు. రైల్వే ఆస్పత్రుల్లో సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. పారామెడికల్ సిబ్బంది నియామకం ఇదివరకు పబ్లిక్ అడ్వర్టైజ్‌మెంట్, నియామక కమిటీ ద్వారా జరిగేదన్నారు. ఇటీవల ప్రభుత్వ ఈ మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) ద్వారా మాత్రమే చేపట్టాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ విధానం వల్ల ఆస్పత్రి యాజమాన్యానికి అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాలు, అనుభవం పరిశీలించే అవకాశాన్ని తగ్గిస్తోందన్నారు. తరచూ సిబ్బంది మారడం ద్వారా ఆస్పత్రి కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీని ప్రభావం రోగులకు అందించే వైద్య సేవలపై పడుతోందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని గత నియామకపు విధానాన్ని పునరు ద్ధరించి, ఆస్పత్రి కమిటీ ఆధ్వర్యంలోనే మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ఏపీలో నాలుగు ప్రధాన రైల్వే డివిజన్లు విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు ఉన్నప్ప టికీ సొంత రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు లేదన్నారు. దీని కారణంగా ఉద్యోగ ఖాళీలు భర్తీకావడం లేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఏపీకి ప్రత్యేక రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసి, రైల్వే ఉద్యోగాల భర్తీపై కేంద్ర ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలని కోరారు.

మెడికల్ షాపులో విస్తృత తనిఖీ



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్

రాయదుర్గంటౌన్, మార్చి26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. టాసెక్స్ అనే మత్తు టానిక్ పెద్ద ఎత్తున అమ్ముతున్నారన్న సమాచారం రావడంతో స్థానికంగా ఉన్న ఓ మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. ఈ నెల 14న టాసెక్స్ మత్తు టానిక్‌ను బళ్లారిలో అమ్మడంతో చిత్రదుర్గం పోలీసులు హనుమరెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాయదుర్గంలో హనుమరెడ్డికి చెందిన మెడికల్‌స్టోర్‌ను తనిఖీ చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మందులు అమ్ముతున్నట్లు తనిఖీల్లో తేలింది. స్థానిక వీఆర్వో, ఇద్దరు పోలీసుకానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేశారు. వెయ్యికి పైగా ఈకాఫ్ సిరప్‌లు దొరికాయి. వాటిని సీజ్ చేశారు.

కాలి పిక్క నుంచి గాలం తీసిన 108 సిబ్బంది

గార్లదిన్నె, మార్చి 26(ఆంధ్రజ్యోతి): యువకుడి కాలిపిక్కలో గుచ్చుకున్న చేపల గాలాన్ని 108 సిబ్బంది బుధవారం చాకచక్యంగా తీశారు. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ప్రసాద్ బుధవారం గ్రామ సమీపంలోని నీటి కుంటలకు చేపలు పట్టేందుకు గాలంతో వెళ్లాడు. అక్కడ పొరపాటున గాలం ప్రసాద్ కాలిపిక్కలో ఇరుక్కుంది. కుటుంబ సభ్యులు గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. వారు తీయలేక అనంతపురం వెళ్లమని 108లో పంపారు. 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) లక్ష్మీనారాయణ, పైలెట్ బాబు ఇస్మాయిల్ చాకచక్యంగా గాలాన్ని తీసి, బాధితుడిని సురక్షితంగా ఇంటికి పంపారు.

ఖాతాల్లోకి అదనపు సొమ్ము: పీడీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శైలజ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహాల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అదనపు ఆర్థిక సాయం సొమ్ము వారి ఖాతాల్లో జమ చేశారు. ఇప్పటి వరకు చేసిన సర్వేలో4వేల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.5.94కోట్లు జమ చేసినట్లు హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు. ఈ అంశంపై బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనెల 19 నుంచి 23వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల సర్వే చేపట్టామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు 16389మందికి గాను 15438మంది లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి అంగీకారపత్రం సేకరించామన్నారు. గత ప్రభుత్వం చెల్లించిన మొత్తంతో పాటు బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో 6080మంది లబ్ధిదారులకు గాను రూ.9.11కోట్లు నిధులు మంజూరు చేసినట్లు పీడీ వెల్లడించారు.



గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుత్తి మండ లం గొల్లలదొడ్డి (సేవాఘడ్)లో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఏప్రిల్ 4లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ఎస్టీ బ్యాక్ లాగ్ కింద 6వ తరగతిలో 49 సీట్లు, 7వ తరగతిలో 30, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 06 సీట్లు ఖాళీలున్నాయన్నారు. ఈ సీట్ల భర్తీలో ఎస్టీలకు 78 శాతం, ఎస్సీలకు 12 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం, ఏఈక్యు(ఏజెన్సీ ఎంప్లాయ్ కోటా)లకు 3శాతం చొప్పున సీట్లు కేటాయిస్తామన్నారు. http://twreiscet.apcfss.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 20న గొల్లలదొడ్డి గిరిజనపాఠశాలలో రాత పరీక్ష నిర్వహించే మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్‌ను 9885369079, 8978239363, 9550655840 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతపురం విద్య, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) అనంతపురం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం ఉపాధ్యాయభవన్‌లో జిల్లా చైర్మన్ సిరాజుద్దీన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ హృదయ రాజు ఎన్నికల పరిశీలకులుగా హాజరు కాగా... కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన చైర్మన్‌గా శ్రీనివాసనాయక్, ప్రధానకార్యదర్శిగా పురుషోత్తం, కో చైర్మన్లుగా ఓబులేసు, లింగమూర్తి, ఉప ప్రధాన కార్యదర్శిగా గోవిందరాజులు, రమణారెడ్డి, వెంకటేషు, కార్యదర్శిగా వెంకటరత్నం, కోశాధికారిగా రెహమాన్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరెడ్డి, మంజుల, సిరాజుద్దీన్, రామాంజినేయులు, శివశంకర్, లింగమయ్య, గోపాల్‌రెడ్డి, జయరాంరెడ్డి, కరీముల్లా, మల్లికార్జునను ఎన్నుకున్నారు.

గంజాయి విక్రేతకు పదేళ్ల జైలు

గుంతకల్లు/అనంతపురం క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గంజాయిని ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలిస్తూ గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టుబడిన వ్యక్తికి అనంతపురం ఏడీజే సత్యవాణి 10 సంవత్సరాల జైలు, రూ. లక్ష జరిమానా విధించారు. ఒడిశా రాష్ట్రం కోడెల గ్రామా నికి చెందిన భగవాన్ పోలై 2023 డిసెంబరు 18న గంజాయిని తరలిస్తూ గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డాడని జీఆర్పీ పోలీ సులు తెలిపారు. ఒడిశా నుంచి 32 కేజీల గంజాయిని గుజరాత్‌కు తరలించడానికి వచ్చిన నిందితుడు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో రైలు మారడానికి దిగాడన్నారు. రైలు కోసం వెయిటింగ్ హాల్‌లో వేచి ఉండగా, సాధారణ తనిఖీల్లో భాగంగా బ్యాగులోని సమాన్లను తీసి చూడగా అందులో గంజాయి కనిపించిందన్నారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న ఏఈఓ ఓబులేశు నుంచి ఫిర్యాదు తీసుకున్న అప్పటి జీఆర్పీ సీఐ నగేశ్‌బాబు కేసు నమోదుచేసి దర్యాప్తును పూర్తిచేసి అనంతపురం ఏడీజే కోర్టుకు చార్జ్‌షీట్‌ను దాఖలుచేశారు. కేసులో నలుగురు సాక్షులను విచారించిన ఏడీజే సత్యవాణి ఆరోపణ రుజువు కావడంతో బుధవారం తీర్పును వెలువరించారని జీఆర్పీ పోలీసులు తెలిపారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఈశ్వరమ్మ వాదించారని పేర్కొన్నారు.

బడి పిలుస్తోందికి జాతీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న తరిమెల రాజు

అనంతపురం కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అనంత పురం వాసులు నిర్మించిన లఘుచిత్రానికి జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి దక్కింది. నగరానికి చెందిన తరిమెల రాజు దర్శకత్వంలో నిర్మాత కేపీ రాజు, డీఓపీ పవన్ లింగాల బడి పిలుస్తోంది లఘుచిత్రాన్ని నిర్మించారు. ఢిల్లీకి చెందిన ఎన్‌హెచ్‌ఆర్సీ ఇటీవల జాతీయస్థాయిలో నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌లో బడి పిలుస్తోంది లఘుచిత్రాన్ని ద్వితీయ బహుమతికి ఎంపిక చేసింది. ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్‌సి మానవ అధికార భవన్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవ సభలో తరిమెల రాజుకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇండియా చైర్మన్, జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం చేతులమీదుగా బహుమతితోపాటు రూ.1.5 లక్షలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ విభాగానికి చెందిన జోగేంద్రసింగ్, భరత్‌లాల్, విజయభారతి సయాని, ప్రసాద్ మీనా, లఘుచిత్ర కళాకారులు సాకే సుధాకర్, శంకర్‌రెడ్డి, శ్రీపాద పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సహర్ (శుక్రవారం ఉదయం)
కదిరి :	6.32	5.01
ధర్మవరం :	6.37	5.01

పదిపై పట్టుకోసం ప్రైవేట్ పాట్లు



కదిరిలో పది పరీక్ష కేంద్రం గోడ దూకుతున్న యువకుడు

- కదిరిలో కార్పొరేట్ ఆగడాలు..
- పరీక్షల్లో పబ్లిక్‌గా చూచిరాతలు
- మంచి ఫలితాల కోసం అడ్డదారులు
- పరీక్ష నిర్వహణ అధికారులకు తాయిలాలు..!
- పరీక్ష కేంద్రాల వద్ద కనబడని 144 సెక్షన్
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- నష్టపోతున్న మెరిట్ విద్యార్థులు

కొత్తచెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష.. ప్రతి విద్యార్థి ప్రతిభకు గీటురాయి.. విద్యార్థి సామర్థ్యానికి ఇదొక సూచిక. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదవాలన్నా.. మంచి కాలేజీలో సీటు దక్కాలన్నా.. పదిలో వచ్చిన మార్కులే ప్రామాణికం. అంతటి ప్రాధాన్యం కల్గిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలను కదిరిలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు తమ స్వార్థానికి సర్వనాశనం చేస్తున్నాయి. ఆ పరీక్షల్లో అడ్డదారుల్లో అక్రమాలకు తెరలేపాయి. ఇన్విజిలేటర్లు, పరీక్షల నిర్వాహకుల్లో కొందరు ముఖ్య అధికారులకు డబ్బుతో కొనేసి.. పబ్లిక్‌గా చూచిరాతలను ప్రోత్సహిస్తున్నాయి. కొందరు మధ్యవర్తులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లి.. స్లిప్పులు ఇస్తున్నారు. కదిరిలో ఈ నెల 24 జరిగిన గణిత పరీక్షే దీనికి నిదర్శనం. ఇలా కదిరిలో పదో తరగతి టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు చూచి రాతలు రాస్తుంటే.. ఇక ఇతర ప్రాంతాల్లోని మెరిట్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో తమ పిల్లల భవిషత్ ఏమౌతుందోనని ఆ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీ జరగకూడదని, ఉత్తీర్ణత శాతం తగ్గినా ఫర్వాలేదని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఇన్విజిలేటర్లదే బాధ్యతని, ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తామని డీఈఓ కిష్టప్ప చెప్పిన మాటలు చాలా ప్రాంతాల్లో అమలు కావడంలేదు.

● నష్టపోతున్న మెరిట్ విద్యార్థులు..

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల పది పరీక్షల్లో తమ విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత కావాలని, మంచి మార్కులు తెచ్చుకోవాలని, దీంతో తమ అడ్మిషన్లు పెరుగుతాయని ఈ అడ్డదారులు తొక్కుతున్నాయి. దీంతో జిల్లాలో చాలా చోట్ల ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, కొంత మంది విద్యాశాఖలో పనిచేసే అధికారులు ప్రవేటు, కార్పొరేట్ స్కూల్స్ ఇచ్చే తాయిలాలకు తలొగ్గి పనిచేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. చాలా పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రవేటు, కార్పొరేట్ యాజమాన్యాల కనుసన్నల్లో జరుగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎన్ని ఆదేశాలు వచ్చినా ఇన్విజిలేటర్లు సస్పెండ్ అవుతున్నా మాస్ కాపీ జిల్లాలో ఆగడం లేదు. దీంతో మెరిట్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

● ముగ్గురు ఉపాధ్యాయులు సస్పెన్షన్

ఇప్పటి వరకు జరిగిన పది పరీక్షల్లో ఒక విద్యార్థి డీబార్‌తో పాటు ముగ్గురు ఇన్విజిలేటర్లు (ఉపాధ్యాయులు) అధికారులు సస్పెండ్ చేశారు. వారితో పాటు కదిరిలోని పరీక్ష కేంద్రాలకు సంబంధించి ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టమెంట్ ఆఫీసర్లు.. మొత్తం విధుల నుంచి 25 మందిని తప్పించారు.

● 144 సెక్షన్ ఏదీ..?

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న 104 కేంద్రాల వద్ద సాధారణంగా పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేస్తారు. అంతేకాకుండా పరీక్షలు జరిగే కేంద్రాల సమీప ప్రాంతాల్లో జిరాక్సు సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలి. అయితే ఈ నిబంధనలు ఎక్కడా మచ్చుకైనా అమలు కావడం లేదు. డీఈఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు జరుగుతున్నాయి. అయితే ఆ పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్సు సెంటర్లు, నెట్‌సెంటర్లు తెరిచే ఉంచుతున్నారు.





కదిరి: కిటికీలో నుంచి స్లిప్పులు అందిస్తున్న మహిళలు, కొత్తచెరువు: పరీక్ష కేంద్రం వద్ద ఉన్న జిరాక్స్, నెట్ సెంటర్

ప్రోత్సహిస్తే సస్పెన్షనే..

పది పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడితే డీబార్ చేస్తాం. మాస్ కాపీయింగ్‌ను ఉపాధ్యాయులు ప్రోత్సహించినా వారిని కూడా సస్పెండ్ చేస్తాం. కదిరిలో ఈనెల 24న గణిత పరీక్షల్లో జరిగిన విధంగా మరళా జరగకుండా పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న మొత్తం 25 మందిని విధుల నుంచి తప్పించాం. కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశాం.

- డీఈఓ కిష్టప్ప

న్యూస్ బాక్స్

సక్షం అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



మల్లిరెడ్డిపల్లిలో కూరగాయలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ

తనకల్లు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిరెడ్డిపల్లి, పెద్దపల్లి, బాబేనాయక్‌తండా, రత్నినేనాయక్‌తండా, గుర్రంబైలు, కోటపల్లి, బాలసముద్రంలోని సక్షం అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ జయంతి బుధవారం తనిఖీ చేశారు. సక్షం కేంద్రాల వద్ద సాగుచేసిన ఆకుకూరలు, కూరగాయల పంటలను పరిశీలించారు. మల్లిరెడ్డిపల్లిలో పురుగుమందులు లేకుండా పండించిన కూరగాయాలు, ఆకుకూరలను గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ.. సక్షం కేంద్రాల ద్వారా అందిస్తున్న పురుగు మందులు లేని ఆకుకూరలు, కూరగాయాలను గర్భవతులు, బాలింతలు తప్పకుండా తినాలన్నారు. సక్షం కేంద్రాల నిర్వాహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు, టీడీపీ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వెలుగు సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నరసయ్య

బత్తలపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కే ఫంక్షన్ హాల్లో 16 మండలాల వెలుగు సిబ్బందికి శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. పీడీ నరసయ్య మాట్లాడుతూ.. ప్రతి సంఘ సభ్యురాలు వార్షిక రుణ ప్రణాలిక తయారు చేయాలన్నారు. రుణాలు ఎందుకు తీసుకుంటున్నారు.. ఆ రుణంతో ఏ ఏ వ్యాపారాలు చేస్తున్నారు.. అనే విషయాన్ని విచారణ చేసి కచ్చితమైన నివేదిక ఇవ్వాలన్నారు. ఎవరైన చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వారు సంబంధించిన వాటిలో శిక్షణ తీసుకోవాలన్నారు. ప్రతి ఐదు సంఘాలకు ఒకరిని ఎంపిక చేస్తామని, వారి ద్వారా ఆయా సంఘల వివరాలు ఆన్‌లైన్‌లో ఈ వివరాలను నమోదు చేయిస్తామని అన్నారు. గ్రామ సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రణాళికపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం



అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికల అధికారి

గాండ్లపెంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు ఎన్నికల అధికారి సుదర్శన్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సీఐ నాగేంద్రకు సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి.. వసతులపై ఆరాతీశారు. ఆయన వెంట తహసీల్దార్ బాబురావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఎస్ఐలు వలీబాషా, గోపీ, ఆర్ఐ చక్రవర్తి ఉన్నారు.

భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ



మల్లిరెడ్డిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్నసిబ్బంది, రైతులు

తనకల్లు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం, మల్లిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతుల భూముల రీసర్వేపై తహసీల్దార్ శోభాసువర్ణమ్మ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వే నిర్వహిస్తున్నపుడు రైతులందరూ పొలాలవద్దకెళ్లి తమకు హక్కు కలిగిన భూములను సంబంధిత సర్వే అధికారులకు చూపించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఒక్కొక్క గ్రామానికి నాలుగు సర్వే బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోండి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కదిరి ప్రాంతంలో టెన్త్ పరీక్షల కోసం నిబంధనలకు విరుద్ధంగా సింగల్ టీచర్‌ను ఇన్విజిలేటర్‌గా నియమించిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఈఓ కిష్టప్పకు యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారం ఇన్విజిలేటర్లగా ఉపాధ్యాయులను నియమించారన్నారు. ఆయన వెంట యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు భూతన్న, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, తాహీర్‌వలి, నరేశ్‌కుమార్, బాబయ్య, కిష్టప్ప పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

నల్లమాడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బియ్యం కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ ఈనెల 30 లోపు చేయించుకోవాలని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసల్దార్ షబానమ్మ బుధవారం తెలిపారు. ఈకేవైసీ చేయించుకోని వారి జాబితాను డీలర్లకు అందించామని, అందులో పేర్లున్నవారందరూ డీలర్ల వద్దకానీ, సచివాలయాలలో కానీ ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

కొత్తచెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లు రఘునాథరెడ్డి కోరారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్యాప్టో సత్యసాయి జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్‌సీ, డీఏ, సరండర్ లీవు, సీపీఎస్, ఉద్యోగుల బకాయిలతో కలిపి దాదాపు రూ.23 వేల కోట్ల చెల్లించాల్సి ఉందన్నారు. 12వ పీఆర్‌సీ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయల సమస్యలు పరిష్కరించాలని వచ్చే నెల రెండో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ శ్రీనివాసులు, ప్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఆర్‌చంద్ర, సుధాకర్, హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

తాడిమర్రి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాడితోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవి ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాను బంద్ చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

జవహర్ నవోదయకు ఎంపిక



షాహిద్, కార్తిక్, ధార్మిక

ఓబుళదేవరచెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజ్ఞాన్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థి కేఎస్ షాహీద్, వశిష్ట పాఠశాల విద్యార్థులు కార్తిక్, ధార్మిక నవోదయ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటి ఆ పాఠశాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్లు ఫక్రుద్దీన్, శివశంకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వివాదాస్పద భూమి జోలికి వెళ్లకండి

బత్తలపల్లి, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంపెట్లలో సర్వే నంబరు 107లోని భూమి వివాదంలో ఉందని, ఎవరూ దాని జోలికి వెళ్లరాదని తహసీల్దార్ స్వర్ణలత హెచ్చరించారు. ఆ భూమి విషయమై మంగళవారం రాత్రి ఇరువర్గల వారు ఘర్షణపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమశేఖర్ తన సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లి వారితో చర్చించారు. బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు రప్పించుకొని.. కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువర్గాల వారిని తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి నిగ్గతెల్చే వరకూ ఆ భూమిలోకి ఎవరు వెళ్లరాదని, వెళ్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక గణేష్ కూడలిలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదిమహల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాసదీక్ష విరమణ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, డీఆర్ఓ విజయసారధి, ఆర్డీఓ సువర్ణ పాల్గొన్నారు. ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం విన్నవించారు. సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ... పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం, మహాత్మాగాంధీకాలనీ, రాజశేఖర్‌రెడ్డికాలనీ, ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4 కాలనీల్లో నీటి సమస్య పరిష్కరించాలని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కాలనీలు ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు అవుతున్నా .. కనీస సౌకర్యాలు కల్పించలేదని, సమస్యలను పరిష్కరించలేదని వాపోయారు. కాలనీల్లోని సమస్యలు పరిష్కరించకపోతే.. సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇందులో సీఐటీయూ మండల కో-ఆర్డినేటర్లు అయుబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలీ, బత్తల కదిరప్ప, హరి, వెంకటస్వామి, ఖాదర్‌బాషా, రెడ్డప్ప ఉన్నారు.

ఈకేవైసీ గడువు పొడిగించండి : సీపీఐ



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవడానికి గడువును ప్రభుత్వం మరోనెల పొడిగించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుదారులు ఈ నెల లోపల ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో కార్డుదారులు సకాలంలో ఈకేవైసీ చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేషన్ కార్డుదారులు ఉపాధి నిమిత్తం బయట ప్రాంతాల్లో ఉంటున్న కూలీలు, వివిధ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు సకాలంలో తమ స్వగ్రామాలకు వచ్చి ఈకేవైసీ చేయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. మరో నెల పాటు గడువును పెంచి రేషన్ కార్డుదారులందరు ఈకేవైసీ చేయించుకునే అవకాశం కల్పించాలని కోరారు. లేని పక్షంలో రేషన్ కార్డుదారులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట సీపీఐ నాయకులు తిప్పయ్య, డాబా రామకృష్ణ, గంగిరెడ్డి పల్లి నాయుడు, వెంకటరాముడు, ఈశ్వర నాయక్, ఆటో కృష్ణ ఉన్నారు.

ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది మాసాల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని, పలు ప్రజా సమస్యలను పరిష్కరించిందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పీఆర్ ఆర్‌డబ్ల్యూఎస్, హెల్త్, పోలీసు, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ : నియోజకవర్గంలో ఆరు మండలాల్లోని 13 మంది బాధితులకు కొత్త ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ 11.66 లక్షలను మంజూరు చేసింది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. బాధితులు ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు వద్ద పూజ చేస్తున్న హరీష్‌బాబు

ధర్మవరం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తాము రెండు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఆ సమస్యను పరిష్కరించాలని పట్టణంలోని ఎల్ 4కాలనీ వాసులు రెండు రోజుల క్రితం రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ సమస్యపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. అధికారులతో మాట్లాడి తక్షణమే ఆ కాలనీ ప్రజలకు తాగునీటి సమస్య తీర్చాలని ఆదేశించారు. దీంతో బుధవారం అధికారులు, మంత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్‌బాబు బోరు పనులను ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇంకా ఎక్కడైనా తాగునీటి సమస్య వెంటనే వాటి పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు తనిఖీ



పెట్రోల్ బంకులో సిబ్బందికి సూచనలు ఇస్తున్నఆర్డీఓ

ధర్మవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గమ్మగుడి సమీపంలోని భారత్ పెట్రోల్ బంక్‌ను ఆర్డీఓ మహేశ్, డీఎస్ఓ వంశీక్రిష్ణారెడ్డి బుధవారం తనిఖీచేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రోజు వారి వివరాలను రిజిస్ట్రర్‌లో నమోదు చేయకపోవడం, అదేవిధంగా తాగునీరు, వాహనదారుల వాహనాలకు ఉచితంగా అందించే గాలిపంపు సౌకర్యాలు లేకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం చూసి మండిపడ్డారు. మరోసారి తనిఖీలకు వచ్చినప్పుడు రికార్డులు, సౌకర్యాలు స్పష్టంగా ఉండాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట సీఎస్‌డీటీ సురేంద్రనాథ్, డిప్యూటి తహసీల్దార్ సురేష్‌బాబు ఉన్నారు.

క్రైం న్యూస్ ..

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కదిరి అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాండ్లపల్లి సమీపంలో బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం తేలుతూ ఉండటాన్ని గమనించిన ఆ గ్రామస్థులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాలు ఉంటాయని, అతని ఆచూకీ తెలియలేదని, కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ముదిగుబ్బ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగల్లులో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక ఇంటిలో మంటలు వ్యాపించాయి. రూ. రెండు లక్షల దాకా నష్టం వాటిల్లినట్టు బాధితుడు శివయ్య తెలిపాడు. అతను తన కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి ఆరు బయట నిద్రిస్తుండగా తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానిక ప్రజలు స్పందించి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంటిలో ఉన్న నగదు, ఎలక్ట్రికల్ వస్తువులు, బియ్యం మూటలు, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. టీడీపీ మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ ఆ గ్రామానికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. రూ. ఐదు వేల ఆర్థిక సాయం అందించారు.

అత్తింటి వేధింపులపై కేసు

ధర్మవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తన భర్త, అత్తింటి వారు వేధిస్తున్నారంటూ ఓ మహిళ స్థానిక టూటౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక డీఎల్‌ఆర్ కాలనీలో ప్రశాంత్, నవ్యజ్యోతి నివాసముంటున్నారు. తనను ప్రశాంత్, అత్త హరియమ్మ, మామ లక్ష్మయ్య, ఆడపడచు హరిత వేధిస్తున్నారంటూ నవ్యజ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి చేశారని ఇద్దరిపై..

ధర్మవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గా బార్ అండ్ రెస్టారెంట్‌లో ధర్మవరం మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన విష్ణు, మారుతి.. రావులచెరువు గ్రామానికి చెందిన మహేంద్ర బుధవారం గొడవ పడ్డారు. విష్ణు, మారుతి బీరు బాటిల్‌తో దాడి చేయడంతో మహేంద్ర గాయపడ్డాడు. దీంతో ఆయన్ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేంద్ర ఫిర్యాదు మేరకు విష్ణు, మారుతిపై కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్టు

పుట్టపర్తి రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర పరిధిలో పలు ప్రాంతాల్లో మట్కా ఆడుతున్న వారిపై అర్బన్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. మట్కాబీటర్లు బుర్రా గోపాల్, మోదుకొండ యాదవ్, గుజ్జలరాజు, పూసల రామయ్య, ఏకులూరు తాజుద్దీన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 20 వేలు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ సునీత పేర్కొన్నారు.

ఎనిమిది మంది జూదరులు ..

కదిరి(తలుపుల), మార్చి 26(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం నూతన కాలువ గ్రామ శివారుల్లో బుధవారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. వారి నుంచి రూ.7,600 స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



ఎన్పీకుంట : చికిత్స చేస్తున్న డీఎంహెచ్ఓ

నంబులపూలకుంట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయ పాలన తప్పక పాటించాలని సూచించారు. తలకు బలమైన గాయంతో పెడబల్లికి చెందిన ఆంజనేయులు ఆ ఆస్పత్రికి రాగా డీఎంహెచ్ఓ చికిత్స చేశారు. ఆమె వెంట వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, వైద్యసిబ్బంది ఉన్నారు.

● గాండ్లపెంట: స్థానిక ప్రాథమిక వైద్యశాలను డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి వసతులపై ఆరాతీశారు.

సజావుగా వారపు సంత వేలం

కొత్తచెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వారపు సంత వేలం పాట సజావుగా సాగింది. వారపు సంత రూ.15,00,500లకు నల్లమాడ శంకర్ వేలం పాట పాడి దక్కించుకున్నారు. గత సంవత్సరం రూ. 6,03,500 పలికిందని, దీంతో రూ. 8,97,000 అధికంగా ఆదాయం వచ్చిందని డీఎల్‌పీఓ కేశవరెడ్డి తెలిపారు. కాగా దినసంత, బస్టాండ్‌కు నిర్వహించాల్సిన వేలం పాట వాయిదా పడింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాధా, కార్యదర్శి రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పారిశుధ్య కార్మికులకు జీతాలివ్వండి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పరిగి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వినోద్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి నారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలు జీతాలివ్వకపోతే వారి కుటుంబ పోషణ ఎలాగని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ.. పంచాయతీలో నిధులు అందుబాటులో లేకపోవడంతో జీతాలు చెల్లించలేకపోయామని, కార్మికులకు నెల జీతాన్ని ఖాతాలో జమచేస్తామని పేర్కొన్నారు.

పన్ను చెల్లింపులపై రాయితీ

పెనుకొండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 31లోగా ఏక మొత్తంలో చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ లభిస్తుందని కమిషనర్ సతీష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కౌంటర్‌లో చెల్లించవచ్చన్నారు.

మహిళ ఆత్మహత్య

చిలమత్తూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మేశ్వరంపల్లికి చెందిన అర్చన (26) బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. అర్చన కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. మానసిక ఒత్తిడికి లోనై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. మృతురాలి భర్త శివశంకర్ కూలీగా పనిచేస్తున్నాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

రైతులు అభ్యంతరాలు తెలియజేయండి

అగళి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కగారి దేవరపల్లి రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వేలో భాగంగా రైతులు హద్దులు తదితర వాటిపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. బుధవారం రెవెన్యూ గ్రామంలో పొలిమేరలోని అమ్మవారి దేవాలయంలో బుధవారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏకేడీహళ్లిలో భూ రీసర్వే జరిగిందని, అభ్యంతరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ప్రకాశ్, మండల సర్వేయర్ మారుతి, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ

అగళి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన అంగన్‌వాడీ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమంలో మడకశిర సీడీపీఓ నాగమల్లేశ్వరి పలు అంశాల గురించి తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లో తీసుకోవాల్సిన చర్యలు, బాధ్యతలు చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు సంబంధించిన విషయాలను శిక్షణ తరగతుల్లో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రస్తా విషయంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని మంగాపురంలో జరిగిన ఘర్షణలో చంద్ర అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మంగాపురం సమీపంలోని రైల్వేట్రాక్ పక్కన వ్యవసాయ పొలం ఉంది. రస్తా విషయంలో అదే గ్రామానికి చెందిన టైలర్ నారాయణ, రామకృష్ణ, చిరంజీవి తనపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని చంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏళ్ల సమస్యలకు పరిష్కారం



విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాలుగా ఉన్న సమస్యలను మంత్రి సవిత ఆదేశాలతో పరిష్కరించామని టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. పట్టణంలోని దర్గాపేట, ఉప్పర్‌వాడ కాలనీలో 15 ఏళ్లుగా మిట్టపై ఇల్లు నిర్మించుకుని ఉన్నారు. అప్పటి నుంచి విద్యుత్‌లేక చీకటిలోనే జీవనం సాగిస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి విద్యుత్ పోళ్లను, వైరు లాగి సమస్యను పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం టీడీపీ నాయకులు దగ్గర ఉండి పనులు చేయించారు. తాగునీటిని సమస్యను కూడా పరిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, రమణమ్మ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి

లేపాక్షి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రీసర్వే ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం కోడిపల్లిలో రీసర్వేపై గ్రామసభ, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రీసర్వేలో సమస్యలు ఉంటే వెంటనే రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాలన్నారు. అనంతరం సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇంటి యజమానులకు ఊరట

● ఆస్తి పన్ను చెల్లింపులో 50 శాతం వడ్డీ రాయితీ ● ఈనెల 31 వరకు అవకాశం

హిందూపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంటి యజమానులకు శుభవార్త ప్రకటించింది. ఈనెల 31లోపు పన్ను చెల్లించే ఇంటి యజమానులకు ఊరటనిచ్చింది. పట్టణాల్లో ఆస్తిపన్ను వడ్డీపై 50శాతం రాయితీ ప్రకటిస్తూ జీఓ జారీచేసింది. ఇప్పటి వరకు దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించకుండా ఉన్నవారికి వడ్డీల భారంతో కొందరు పన్నులు చెల్లింపునకు ఆసక్తిచూపలేదు. దీనివల్ల బకాయిలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో వందశాతం పన్నులు వసూళ్లే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వడ్డీపై 50 శాతం రాయితీ ఇవ్వడంతో మున్సిపాలిటీలోని ఇంటి యజమానులకు ఉపశమనం కల్పించినట్లయింది. ఆస్తి పన్ను చెల్లింపుపై ఈనెల 25న 50శాతం వడ్డీరాయితీ ప్రకటించడంతో ఇంతకు ముందు చెల్లించినవారిలో కొంత నిరాశ నెలకొంటోంది. దీంతో వారికి కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు. ఈ రాయితీని 2025-26వ ఆర్థిక సంవత్సరంలో చెల్లించే పన్నులో సర్దుబాటు చేస్తారు. వడ్డీ మినహాయింపుతో ఈనెల 31లోపు పన్నులు చెల్లింపునకు సమీపంలోని సచివాలయంలోకానీ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ ఆన్‌లైన్‌లో క్రెడిట్ లేదా నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా చెల్లించవచ్చు. ఏప్రిల్ 1నుంచి వడ్డీపై వడ్డీ వసూలు చేస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. వడ్డీపై రాయితీతో హిందూపురం పట్టణ ప్రజలకు సుమారు రూ.70లక్షల నుంచి రూ.కోటి దాకా లబ్ధి చేకూరే అవకాశం ఉంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రైవేట్ ఆస్తులు 38,290 ఉండగా, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 152, కేంద్రం ప్రభుత్వానికి సంబంధించి 58 ఆస్తులు ఉన్నాయి. ఈ యేడాది మునిసిపాలిటీకి రూ.14కోట్లు లక్ష్యం ఇవ్వగా బుధవారం నాటికి రూ.11.60 కోట్లు వసూలయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన భవనాలకు ఇప్పటి వరకు రూ.10కోట్లు బకాయి ఉంటుందని అంచనా.



మున్సిపల్ కార్యాలయం

సద్వినియోగం చేసుకోండి

చాలా ఏళ్లుగా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఆస్తిపన్ను బకాయిలున్నవారికి రాష్ట్ర ప్రభుత్వం వడ్డీపై 50శాతం రాయితీ ఇచ్చింది. దీనివల్ల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని బకాయిలు చెల్లించాలి.

- సంఘం శ్రీనివాసులు, కమిషనర్

అభివృద్ధిని చూసే టీడీపీలోకి వలసలు: గుండుమల



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని పలు పార్టీల నుంచి టీడీపీలోకి వస్తున్నారని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. బుధవారం అమరాపురం మండలం ఆలదపల్లి వైసీపీ నేతలు మడకశిర పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. వైసీపీ వార్డు మెంబర్లు గోపాలప్ప, అజ్జన్న, డి.రంగస్వామి, నరసింహప్ప, దేవరాజుతోపాటు 20 కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ.. జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్ల వెనకబడిందని, ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని అన్నారు. చంద్రబాబు రాకతో సాగునీటి ప్రాజెక్టుల పనులు తిరిగి ప్రారంభమయ్యాయని తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో వైసీపీ దాదాపు ఖాళీ అయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీనివాసమూర్తి, లక్ష్మీనారాయణ, ఓంకార్‌స్వామి, పరమేశ్వరప్ప, రామచంద్రప్ప పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోండి

గోరంట్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అనుమతి లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఓ, ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. ఓ బాలికపై ప్రిన్సిపాల్ అసభ్యంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఏఓకు వినతి పత్రం అందించారు. హాస్టల్ నిర్వాహణపై మండల విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతులయ్య, అరుణ్, నిరంజన్, జగదీష్, చరణ్ పాల్గొన్నారు. హాస్టల్‌లో ఉండే బాలికలకు రక్షణ కల్పించాలని, సంఘటనకు కారకులైన ప్రిన్సిపాల్, పాఠశాలపై చర్యలు చేపట్టాలని ప్రగతి శీల విద్యార్థిసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్ర, అఖిలభారత బంజార సేవా సంఘం మాజీ అధ్యక్షుడు పాలే జయరాంనాయక్ వేర్వేరు ప్రకటనల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

నా భర్త తప్పు చేయలేదు

ఎస్సీఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసు నమోదైన పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీపతి ఎలాంటి తప్పు చేయలేదని, తమ సంస్థ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంతమంది పన్నిన కుట్ర అని అతడి భార్య శశికళ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిజానిజాలు న్యాయస్థానంలో తేలుతాయని ఆమె పేర్కొన్నారు.



ఏఓకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నేడు కల్లుమర్రి ఉప సర్పంచ్ ఎన్నిక

మడకశిర రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమర్రి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహిస్తున్నాట్లు ఎంపీడీఓ సోనియాబాయి తెలిపారు. గతంలో ఉన్న ఉపసర్పంచ్ రాజీనామా చేయడంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీలో 12 మంది వార్డు సభ్యుల ఉన్నారు. ఉదయం 11 గంటలకు కల్లుమర్రి గ్రామ సచివాలయంలో ఈ ఎన్నిలు నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. వార్డు సభ్యులు అందరూ కలసి ఉప సర్పంచ్‌ను ఎన్నుకోనున్నట్లు వివరించారు. ఆర్‌ఓ నాగరాజునాయక్‌ను నియమించినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : సీఐ

ఎన్నిల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నాగేష్‌బాబు తెలిపారు. గురువారం కల్లుమర్రి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. బుధవారం ఆ గ్రామానికి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. గ్రామస్థులు, వార్డు సభ్యులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓని కలసి ఎన్నిల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు.



వార్డు సభ్యులు, గ్రామస్థులతో చర్చిస్తున్న సీఐ నాగేష్‌బాబు

బాల్య వివాహాలు సమాజానికి హాని

చిలమత్తూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు సమాజానికి హాని అని హిందూపురం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టేకులోడు గురుకుల పాఠశాలలో ఆర్డీటీ, ఐసీడీఎస్ సంయుక్తంగా 'బాలికలను చదివిద్దాం-బాలికలను రక్షిద్దాం' అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. సమాజంలో బాల్యవివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలతో ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. బాల్య వివాహాలు చేయడం వలన చిన్నారుల బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేయడమే అవుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 1098 నంబర్‌కి, ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు 100, 112 నంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, మడకశిర రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున, ఎంఈఓ సల్మాన్ రాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అగళి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శేఖర్‌నాయక్ తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 68 శాతం రైతులు ఏపీఎఫ్ఆర్ఎస్ చేయించుకున్నారని పేర్కొన్నారు. పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, పంటల బీమా తదితర పథకాలు అందాలంటే తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ఎస్ చేయించుకోవాలన్నారు. మడకశిర ఏడీఏ కృష్ణమీనన్ వ్యవసాయశాఖ కార్యాలయంలో సిబ్బందికి తగు సలహాలు సూచనలు అందజేశారు. రైతులు ఎక్కడ ఉన్నా ఫోన్ ద్వార అయినా సంప్రదించి చేయించుకోవాలన్నారు. రైతు నష్టపోకుండా జాగ్రత్త పడాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమీనన్

సీలు లేకుండా కోడిగుడ్ల సరఫరా

● అంగన్‌వాడీల్లో షరామామూలే ● పట్టించుకోని అధికారులు

హిందూపురం అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చేసిన తప్పులు మళ్లీ మళ్లీ చేస్తూనే ఉన్నారు. గుడ్లు సరఫరా చేసేందుకు తొమ్మిది నెలల్లో చాలా మంది మారిపోయారు. సరఫరాదారులు మారిన ప్రతిసారి గుడ్లు సీలు లేకుండా పంపుతున్నారు. పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, కోడి గుడ్లు అందిస్తున్నాయి. వాటికి రంగులు వేసి పంపుతున్నారు. సీలు లేకుండా పంపడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని గుడ్లు అంగళ్లలో అమ్ముకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. దీనివల్ల ప్రభుత్వాల ఆశయానికి గండిపడుతోంది. సీలు లేకపోతే గుడ్లు పక్కదారి పట్టేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీలు లేకుండా కోడిగుడ్లు సరఫరా చేయకూడదు. హిందూపురం ఐసీడీఎస్ కార్యాలయ పరిధిలో పలుమార్లు ఇదే తప్పిదాలు జరుగుతున్నాయి. అనేకసార్లు ఈ విషయంపై ఐసీడీఎస్ అధికారులకు అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. సరఫరా చేసే వ్యక్తులు మారడంతో మరోమారు సీలు లేకుండా వచ్చాయి. కొత్తగా టీడీపీకి చెందిన ఓ నాయకురాలు కోడిగుడ్లు, బాలమృతం, బాల సంజీవిని సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.



సీలు లేకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపిన కోడిగుడ్లు

సరఫరా చేసేవారు మారారు: శాంతి, సీడీపీఓ

ఇంతకు ముందు సరఫరా చేసిన వ్యక్తి కాకుండా ఇప్పుడు సరఫరాదారులను మార్చి మరొకరికి ఇచ్చారు. దీంతో వారు సీలు లేకుండా పంపారు. వారికి తెలియజేసి మరోసారి ఇలా సీలు లేకుండా పంపవద్దని తెలియజేస్తాం.

బైక్ రేసర్లపై కఠిన చర్యలు

● 9440796840కు సమాచారం ఇవ్వండి ● పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



పెనుకొండ టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బైక్ రేసర్లపై కఠినమైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. దాడులు, దౌర్జన్యాలు అసాంఘిక కార్యకలాపాల కు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించే ప్రసక్తేలేదని ఆయన స్పష్టం చేశారు. పలు అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న : బైక్ రేసర్లను ఎలా అరికడతారు ?

జవాబు : ఇటీవల పెద్దఎత్తున బైక్ రేసర్లు పెనుకొండ కొండకు వెళ్లేదారిలో ఘాట్ సెక్షన్‌కు వస్తున్నారు. అలాంటి వారు విన్యాసాలు చేస్తూ పట్టుబడితే చర్యలు తప్పవు. 304-2 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తాం. బహిరంగ ప్రదేశాల్లో ఈ రేసులు చేస్తే ప్రజల జీవితాలతో చలగాటం ఆడినట్లే. వీడియోలతోసహా ఆధారాలను కోర్టుకు సమర్పించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కొండపైన బైక్ రేసర్ల అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాం.

ప్రశ్న : నేరస్థుల ఆచూకీ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు : నేరస్థుల ఆటకట్టించేందుకు మూడువేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టుదలతో ఉన్నాం. ఎస్పీ రత్న ఈ సీసీకెమెరాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పెనుకొండ డివిజన్‌లో దాదాపు 500 కెమెరాలు సిద్ధం చేశాం. ఏ చిన్న సంఘటన జరిగినా తెలిసేలా అధునాతన సీసీకెమెరాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలేమిటి..?

జవాబు : జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా అజాగ్రత్త కారణంగా జరుగుతున్నాయి. డ్రైవర్లు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఇటీవల కలెక్టర్‌తో పలు సమస్యలపై చర్చించాం. వై జంక్షన్‌పై హెవీలైటింగ్ ఏర్పాటుకు కోరాం. హెల్మెట్ తప్పక వాడాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు.

ప్రశ్న : అసాంఘిక కార్యకలాపాలపై ఏమి చర్యలు తీసుకున్నారు..?

జవాబు : సబ్‌డివిజన్ పరిధిలో ప్రత్యేక టీమ్ తిరుగుతోంది. ప్రజలు కూడా బాధ్యతగా తమ దృష్టికి వస్తే నా నంబరు 9440796840కు ఒక ఫొటో పంపండి. క్షణాల్లో వారి ఆటకట్టిస్తాం. ప్రతి పౌరుడు పోలీస్ అనుకుని అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వండి. డివిజన్‌లో డ్రోన్ అందుబాటులో ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోకండి.

ప్రశ్న : పోక్సో కేసులు అధికం అవుతున్నాయి. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు: ఇటీవల పోక్సో కేసులు అధికమవుతున్నాయి. పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కల్పించి తగు జాగ్రత్తలను సూచిస్తున్నాం. తప్పుచేస్తే చట్టాలు కఠినంగా ఉన్నాయి. ఇబ్బందులు తప్పవు. పోలీసులు ఉన్నారని భరోసా కల్పిస్తున్నాం.

మద్యం కేసులో ఇద్దరికి ఏడాది జైలు

- రూ.2లక్షల జరిమానా

పెనుకొండ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.2లక్షలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. వివరాల్లోకెళితే.. 2020 ఫిబ్రవరి 20న పెనుకొండ దర్గాపేటకు చెందిన మహబూబ్‌బాష, బాబాఫకృద్దీన్ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా షీప్ ఫారం వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 29 విస్కీ, 180ఎంఎల్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని అప్పటి ఎస్ఐ హరున్‌బాషా కోర్టుకు సమర్పించారు. విచారణ అనంతరం జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి బొజ్జప్ప నిందితులకు చెరో సంవత్సరం జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానా విధించినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

పనిచేసే వారికే మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్లు

పావగడ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పనిచేస్తూ.. సమస్యలు పరిష్కారానికి కృషిచేసే వారికే మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయిస్తామని మాజీ మంత్రి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్ కార్యాలయాన్ని నూతనంగా తీర్చిదిద్దారని తెలిపారు. ప్రజల సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి కృషిచేయాలని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు గీత, మున్సిపల్ ముఖ్య అధికారి జాఫర్ షరీఫ్, నాయకులు నాని, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు



సిమెంటు రోడ్డు వేస్తున్న దృశ్యం

గోరంట్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లి, మలసముద్రం పంచాయతీలకు రూ. 10లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలు ఎంపీ బీకే పార్థసారథి నిధులు మంజూరు చేశారు. మల్లాపల్లి పంచాయతీలోని కొత్తపల్లిలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులకు బుధవారం టీడీపీ జిల్లా కార్యదర్శి నరసింహప్ప, మండల కార్యదర్శి అశ్వర్థప్ప భూమి పూజ చేశారు. మల్లాపల్లిలో రూ.5లక్షలతో, మలసముద్రంలోని జక్కసముద్రం, బూదిలివాండ్లపల్లి గ్రామంలోరూ.5లక్షల చొప్పున నిధులతో సీసీరోడ్లు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు ఫిరోజ్ బాషా, నాగేంద్ర, చంద్ర, కార్తిక్‌యాదవ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపీపీ

గుడిబండ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని ఎంపీపీ రాధమ్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఈఓఆర్డీ, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ, సమన్వయంతో పనిచేసి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో సమస్య పరిష్కారం కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి కోసం వేసిన బోరు బావులకు విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. కూలీలు వలస పోకుండా పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎంపీడీఓ గంగాధర్, ఈఓఆర్డీ నాగరాజునాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాధమ్మ